క్లుప్తంగా

నలుగురు వీఆర్వోల సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్: ప్రజల వినతులను బాధ్యతగా పరిష్కరించాల్సిన వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్) లు ముడుపులు తీసుకోవడంతో సస్పెండ్ అయ్యారు. జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారంపై అధికారులు అర్జీదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్ రూపంలో అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. ఈ అర్జీల పరిష్కారానికి ముడుపులు స్వీకరించారని అర్జీదారులు వెల్లడించారు. దీంతో కలెక్టరేట్ అధికారులు సంబంధిత వీఆర్వోలపై విచారణ చేపట్టారు. అనంతరం జిల్లాలోని బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లి, ఎస్ఆర్ పురం మండలం, నెలవాయి, గంగవరం మండలం గండ్రాజుపల్లి, నింద్ర మండలం అగరం వీఆర్వోలను సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు.

155 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శంకర్

తవణంపల్లె: మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్లో ప్రముఖ యూరాలజిస్టు, సర్జన్ డాక్టర్ హెచ్.ఎస్ శంకర్ 155 మందికి వైద్య పరీక్షలు చేశారు. అరగొండ అపోలో హాస్పిటల్లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ యూరాలజిస్టు, సర్జన్ డాక్టర్ శంకర్ పలురకాల వ్యాధులకు పరీక్షలు చేయించారు. ఇందులో శస్త్ర చికిత్సల కోసం ఐదుగురిని ఎంపిక చేశారు. వీరికి అపోలో హాస్పిటల్ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తామని జీఎం డాక్టర్ వినోద్, మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ఘన నివాళి


నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని నర్తపువేనుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుకేష్‌రెడ్డి నానమ్మ సి.జయమ్మ శనివారం మృతి చెందారు. పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సునీల్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి ఆమె భౌతిక కాయానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

స్కానింగ్ సెంటర్ తనిఖీ



చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం తోటపాళ్యంలోని మధు స్కానింగ్ సెంటర్‌ను శనివారం డీఐఓ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌ను సందర్శించి పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు. అలా చేసిన పక్షంలో రూ.10వేల జరిమానా, జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

ఆనందాల ఉగాది కావాలి


ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: తెలుగు వారి సంప్రదాయాలు, సంస్కృతిని తెలియచేసే ఉగాది పండుగను ప్రజలు ఆనందాల మధ్య జరుపుకోవాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆకాంక్షించారు. ప్రజా సేవలో ఉంటూ అంకితభావంతో పనిచేస్తున్న పోలీసులకు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు.

ఉగాది సందడి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని శనివారం ఉగాది సందడి నెలకొంది. ఆలయాలన్నీ విద్యుత్‌దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. అనంతరం పంచాంగ శ్రవణం చేయనున్నారు. ఉగాది సందర్భంగా పూజ సామగ్రి అమ్మకాలు చర్చివీధి, బజారువీధి, గిరింపేట, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో జోరందుకున్నాయి.

ప్రదానం



తవణంపల్లె మండలం అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ జీ, పడాయి జీ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐరాల సీడీపీఓ నిర్మల సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన అంశాలను అమలు చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, మంజుల, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. -తవణంపల్లె

చలివేంద్రం



బంగారుపాళెం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం చలివేంద్రాన్ని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ కల్యాణి, జూనియర్ అసిస్టెంట్ లావణ్య, వీఆర్ఓలు సురేంద్ర, వెంకటరత్నం, మోహన్‌శివ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు. -బంగారుపాళెం

దర్శనం



శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. పండితుల ఆశీర్వచనాలు, ప్రసాదం అందజేశారు. -కాణిపాకం

కలుపు నివారణకు లోదుక్కులు

- వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు
- చీడపీడల నివారణకు సహకారం


వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

ఐరాల: రైతులు ఈ వేసవిలో దుక్కులను లోతుగా చేసుకుంటే కలుపు తగ్గుముఖం పడుతుంది. పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి. లేదంటే దిగుబడులు తగ్గి నష్టపోయే ప్రమాదం ఉంది. క్రమం తప్పకుండా ఒకే విధానంలో వ్యవసాయం చేయటం. ఒకే రకమైన పంటలను సాగు చేయడం వలన భూమిలో సారం తగ్గిపోయే అవకాశం ఉంటుంది. దీన్ని అధిగమించడానికి వేసవి దుక్కులు దోహదపడతాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండిచాల్సిన పంటలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా పంటల ఎంపిక, భూసార పరీక్షలు, విత్తన సేకరణ చేయాలని స్పష్టం చేస్తున్నారు. భూసారాన్ని పెంచుకోవడానికి వేసవి దుక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని చెబుతున్నారు. తొలకరి వర్షాలకు ముందుగా భూమిని లోతుగా దున్నటం వలన చీడపీడల నివారణకు భూమి సహకరిస్తుందని, వేసవి దుక్కులు దున్నడం ద్వారా భూమి లోపల ఉన్న సూక్ష్మజీవులు పైకి వచ్చి నశిస్తాయని, తద్వారా రైతులకు మేలు చేకూరుతుందని వివరిస్తున్నారు.

వాలుకు అడ్డంగా..

వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా లోతుగా చేపట్టాలి. ఈ విధంగా చేయడం వలన వర్షాలు పడినా భూమిలో సారం బయటకు కొట్టుకుపోకుండా ఉంటుంది. పొలం గుల్లగా ఉండటం వలన వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. దీని వలన భూ అంతర్భాగంలో నీటి నిల్వలు చెక్కు చెదరవు. తేమను నిలుపుకునే సామర్థ్యం పెంచేందుకు దుక్కుల సమయంలో పశువుల పేడ చల్లి ఎద్దులతో దున్నటం మంచి పద్ధతి. దీని వలన భూసారం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులు ఈ విధానంపై దృష్టి పెట్టాలి. మార్చి రెండో వారం నుంచి మే మొదటి వారం వరకు వేసవి దుక్కులు దున్నడం అనుకూలం.

చీడపీడలు అంతరించిపోతాయి

వేసవిలో లోతుగా భూమిని దున్నుకోవడంతో కలుపు నివారణ సులభతరం అవుతుంది. భూమిని వృథాగా వదిలివేయడంతో భూమిలో పొరలు గట్టిపడతాయి. దీంతో మొక్క వేళ్లు భూమిలోనికి వెళ్లే సమయంలో ఇబ్బందులు ఏర్పడటం, పోషకాలు అందక మొక్కల ఎదుగుదల తగ్గి దిగుబడిపై ప్రభావం పడుతుంది. పంటల కాలం పూర్తయిన తరువాత భూమిని వదిలేయడంతో కలుపు మొక్కలు పెరిగి భూసారాన్ని పీల్చుకుంటాయి. ఈ దశలో వేసవి దుక్కులు చేయడంతో భూమికి నష్టపరిచే కీటకాలు, గుడ్లు, శిలీంద్రాలు, చీడపీడ కారకాలు బయటపడి అంతరించిపోతాయి. అదేవిధంగా భూమి అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే పెరిగిన పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండో సారి మడకతో వేసవి దుక్కులు చేపట్టాలి. దీని వలన భూమి లోపల ఉన్న శిలీంద్రాలు, సిద్ధ బీజాలతో పాటు గడ్డి మూలాలు కూడా బయట పడి అధిక ఉష్ణోగ్రతలకు నశించిపోతాయి. వేసవి దుక్కులు చేపట్టడం వలన భూమి వదులుగా మారి వర్షం కురిసినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది. దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.

రైతులు దృష్టి పెట్టాలి



వేసవి దుక్కులపై రైతులు దృష్టి సారించాలి. ప్రస్తుత సీజన్‌లో వేసవి దుక్కుల కారణంగా పంటల కాలం ముగిశాక భూ అంతర్భాగంలో దాక్కుని ఉన్న కీడు చేసే సూక్ష్మజీవులు, శిలీంద్రాలు నశిస్తాయి. రబీ పంటల కోత తర్వాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. తొలకరి వర్షాలతో వచ్చే నీరు భూమిలో నిలవడంతో పాటు తేమ చేకూరి వేసే ప్రతి విత్తనం మొక్కగా మారేందుకు సహకరిస్తుంది. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం ఆర్బీకేల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి. బీడుగా ఉన్న భూములను రైతులందరూ తప్పకుండా సాగు చేసుకోవాలి. -వరలక్ష్మి, ఏఓ, ఐరాల

ప్రణాళికాబద్ధంగా లక్ష్య సాధన


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు

చిత్తూరు కార్పొరేషన్ : ఉద్యోగులు నిర్దేశిత లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా సాధించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు సూచించారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ, జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాల ఏఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నుంచి చేపట్టే ప్రతి పని రికార్డ్స్‌ను, రిట్నర్స్‌ను కచ్చితంగా పనులవారీగా నమోదు చేయాలన్నారు. ప్రతి పని వివరాల లెక్క పక్కాగా ఉండాలని కోరారు. సంవత్సర వారీగా అకౌంట్స్ నిర్వహణ, బడ్జెట్ ప్రతిపాదన అంశాలను పూర్తి స్థాయిలో నిర్వహించాలని చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయాల పరంగా ప్రతి రికార్డ్ వివరాలకు ఏఓనే బాధ్యుడని స్పష్టం చేశారు. పంచాయతీల వారీగా పనుల వివరాలు, వాటి అంచనా, ఎప్పుడు పూర్తి చేశారనే అంశాలను సక్రమంగా ఉండాలని ఆదేశించారు. వేసవిలో ఎక్కువగా నీటి సమస్యకు నిధులు ఖర్చు చేయాలన్నారు. అనంతరం చేసిన పనుల పరంగా టీడీఎస్ గురించి వాణిజ్య పన్నులశాఖ ఏసీ వరలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జుబేదా, డీసీటీఓ పూర్ణం పాల్గొన్నారు.

చెరువులో మట్టిని తవ్వి అమ్మేస్తున్నారు


మాట్లాడుతున్న చిన్న రెడ్డెప్ప, ఆర్ రెడ్డెప్ప

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లె పంచాయతీ అమ్మగారి చెరువులో కొంత మంది జేసీబీ యంత్రాలతో మట్టిని తవ్వి అమ్మేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక రైతులు తెలిపారు. మిట్టపల్లెకు చెందిన రైతు, విశ్రాంత ఉపాధ్యాయుడు చిన్న రెడ్డెప్ప, ఆర్ రెడ్డెప్ప స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. అమ్మగారి చెరువులో కొంత మంది వ్యాపారం కోసం జేసీబీ యంత్రాలతో మట్టిని తవ్వి అమ్మేస్తున్నారని వాపోయారు. చెరువు కట్టకింద వరకు మట్టి తవ్వడం వల్ల కట్ట కూడా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరి చెరువులో రాతి కూసాలు నాటి ఆక్రమించుకోవడంతో హైకోర్టుకు వెళ్లి తొలగించామన్నారు. ప్రస్తుతం కొందరు జేసీబీలతో లోతుగా మట్టి తవ్వడం వల్ల చెరువులో నీరు కూడా నిల్వ చేరడంలేదని చెప్పారు. దీంతోపాటు గ్రామానికి చెందిన సర్వే నంబరు 231లో 0.65 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారన్నారు. అధికారులు సర్వే చేసి సరిహద్దులు చూపాలని కోరారు. అమ్మగారి చెరువులో అక్రమంగా అనుమతిలేకుండా జేసీబీతో తవ్వి మట్టిని తరలించకుండా నిలుపుదల చేయాలని, శ్మశాన భూమి ఆక్రమణలు తొలగించి సర్వే చేసి సరిహద్దులు చూపాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

సినిమా పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గల్లా అరుణకుమారి

తవణంపల్లె: మండలంలోని కొండ్రాజుకాలువకు చెందిన యువ హీరో దొడ్ల భరత్ నటించిన "మిషన్ 007" చిత్రం పోస్టర్‌ను మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆవిష్కరించారు. మండలంలోని కొండ్రాజుకాలువకు చెందిన నరసింహులు నాయుడి కుమారుడు దొడ్ల భరత్‌కు చిన్న నాటి నుంచి సినిమాలపై మక్కువ ఎక్కువ. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో భోపాల్ పరిసర ప్రాంతాల్లో దేశభక్తిని చాటే విధంగా (పాకిస్తాన్- ఇండియాకు జరిగిన యుద్ధంపై సినిమా) దర్శకుడు జైమోహన్, ప్రొడ్యూసర్లు మహంకాళి, నాగమహేష్, కెమెరామెన్ కిరణ్ దాసరి నేతృత్వంలో మిషన్ 007 చిత్రం షూటింగ్ దాదాపు పూర్తి చేశారు. హీరోగా దొడ్ల భరత్, హీరోయిన్‌గా భోపాల్‌కు చెందిన ప్రియాంకనంద నటించారు. ఏప్రిల్ మూడో వారంలో సినిమా విడుదల కానున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

సంప్రదాయ పండుగలను తెలుసుకోవాలి


పాఠశాలలో ఉగాది వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు సంప్రదాయ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని ర్యాంకర్స్ పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి అన్నారు. మిట్టూరులోని ఆ పాఠశాలలో శనివారం ఉగాది వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు వారు నిర్వహించుకునే అత్యంత ముఖ్యమైన పండుగల్లో ఉగాది పండుగ ముఖ్యమన్నారు. ఈ పండుగను హిందువులు తొలిపండుగగా జరుపుకుంటారని చెప్పారు. ఈ వేడుకలకు సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జయశ్రీ, రిటైర్డ్ ఎంఈవో రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై పట్టు పెంచుకోవాలి


మెలకువలు నేర్పిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థినులు ఆత్మరక్షణపై పట్టు పెంచుకోవాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ విజయశేఖర్ అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని బీఎస్ కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూపేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ మహిళల పట్ల వేధింపులు, అక్రమ రవాణా పిల్లల పై లైంగిక వేధింపులు, సైబర్ నేరాల సమయంలో తమకు తాము రక్షించుకునేలా విద్యార్థినులుండాలన్నారు. బాలికలపై పెరుగుతున్న నేరాల దృష్ట్యా భద్రతను నిర్ధారించేందుకు పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ ముఖ్యమన్నారు. అమ్మాయిలు తమ పరిసరాల పట్ల మరింత అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎస్ఐ నాగసౌజన్య మాట్లాడుతూ బాలికలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు డీఎస్పీ పలు ఆత్మరక్షణ మెలకువలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తులసిబాబు, ఈచర్ల, రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ కరాటే మాస్టర్ దివ్య పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి


మహిళలకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని డాక్టర్ కేశవనారాయణ సూచించారు. ఎగువ మారేడుపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 34 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎండాకాలంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై జవాబుదారీతనం అవసరం


ప్రజావేదికలో పనుల వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులపై క్షేత్ర స్థాయి నుంచి సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేయాలని పీడీ రవికుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 2023–24 సంవత్సరానికి గాను పంచాయతీ రాజ్ కింద రూ 8,61,91,703 ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ పనులకు సంబంధించి, సామాజిక తనిఖీ బృందం ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో పనులను తనిఖీ చేశారని చెప్పారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారి నుంచి రూ.61 వేలు రికవరీ చేసినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడించారు. పొరబాట్లు చేసిన సిబ్బందికి అపరాధ రుసుము చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ శివయ్య, పుంగనూరు క్లస్టర్ ఏపీడీ రవి, ఎంపీడీఓ శ్రీధర్, పీఆర్ఏఈ కృష్ణ, ఏపీఓ కిరణ్, ఈసీ గణేష్, ఏఆర్‌పీ తిరుమలేష్, డీఆర్‌పీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్మేపల్లమ్మ వార్షికోత్సవాలు


ఆలయంలో హోమ పూజలు చేస్తున్న వేదపండితులు

యాదమరి: మండలంలోని కృష్ణంపల్లి పంచాయతీ కోమేపల్లమ్మ దేవాలయంలో శనివారం ఆలయ చైర్మన్ పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల ఆగమ శాస్త్రోక్తంగా యజ్ఞ హోమాదులతో పూజలను ప్రారంభించారు. ధ్వజారోహణంతో మొదలైన ఈ వార్షికోత్సవాలు బుధవారం వరకు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ పద్మనాభరెడ్డి తెలిపారు.